# బండి సంజయ్‌కు మద్దతుగా తిరుపతి నుంచి హైదరాబాద్ వరకు సైకిల్ యాత్ర



హైదరాబాద్, జూన్ 2: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు మద్దతుగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతికి చెందిన పెరుగు వెంకటేశ్వర్లు చేపట్టిన సైకిల్ యాత్ర హైదరాబాద్‌లో ముగిసింది. “శక్తి సంకల్ప యాత్ర” పేరుతో ఆయన తిరుపతి నుంచి హైదరాబాద్ వరకు సుమారు 680 కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణించారు. గత నెల 25న తిరుపతి అలిపిరి వద్ద యాత్ర ప్రారంభించిన వెంకటేశ్వర్లు, పలు పట్టణాలు, గ్రామాల మీదుగా తెలంగాణలోకి ప్రవేశించి హైదరాబాద్ చేరుకున్నారు. బండి సంజయ్‌కు మంచి జరగాలని, ఆయనపై జరుగుతున్న విమర్శలు, దుష్ప్రచారాలను ఎదుర్కొనే శక్తి కలగాలని కోరుతూ ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్న వెంకటేశ్వర్లును కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆహ్వానించి యాత్ర విశేషాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, దేశం, ధర్మం కోసం బండి సంజయ్ చేస్తున్న కృషిని చూసి అభిమానిగా మారానని చెప్పారు. జాతీయవాద భావజాలంతోనే ఈ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. బండి సంజయ్ మాట్లాడుతూ, మండుటెండలోనూ సైకిల్ యాత్ర చేపట్టడం అభినందనీయమని, జాతీయవాదుల పట్ల వెంకటేశ్వర్లు చూపిన అంకితభావం ప్రశంసనీయమని అన్నారు.

# గ్రామాల అభివృద్ధికి శాసనసభ్యులు చేయూత

**ధన్యవాదాలు తెలిపిన గూడెం, గాగిల్లాపూర్ గ్రామాల సర్పంచులు.**





జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని గూడెం, గాగిల్లాపూర్ గ్రామాల ప్రాథమిక పాఠశాల ల ప్రహరి గోడ నిర్మాణానికి ఎంజిఎన్ఆర్ఇజిఎన్ నిధుల నుండి పది లక్షలు రూపాయలు మంజూరు చేసిన మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ లకు ఆయా గ్రామాల సర్పంచులు గూడెల్లి శ్రీకాంత్, ఎర్రల జానకి రాజు లు సోమవారం పత్రిక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గూడెం సర్పంచ్ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, పాఠశాల మరియు గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడు శాసనసభ్యులు అండగా నిలుస్తున్నారని , గ్రామం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే గాగిల్లాపూర్ సర్పంచ్ ఎర్రల జానకి రాజు మాట్లాడుతూ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి మొదట మంజూరు చేసిన నిధులు సరిపోలేదన్న విషయాన్ని శాసన సభ్యుల దృష్టికి తీసుకెళ్లడంతో అదనంగా మరో 10 లక్షల నిధులను మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి సహకరించిన శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ లకు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

# బీఎంఎస్ఆర్‌యూ రాష్ట్ర అధ్యక్షుడిగా పప్పుల సురేష్ నియామకం

**ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని వెల్లడి**




కరీంనగర్, జూన్ 2: భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధ సంస్థ అయిన భారతీయ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ (బీఎంఎస్ఆర్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడిగా పప్పుల సురేష్ నియమితులయ్యారు. కార్మిక ఉద్యమంలో ఆయనకున్న అనుభవం, అంకితభావాన్ని గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి రామ్మోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూర్పు రాంరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పప్పుల సురేష్ మాట్లాడుతూ మెడికల్, సేల్స్ ప్రతినిధులు, ఔషధ రంగ ఉద్యోగులు ప్రస్తుతం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న పనిభారం, ఉద్యోగ భద్రత లేకపోవడం, లక్ష్యాల పేరుతో మానసిక ఒత్తిళ్లు, కార్మిక చట్టాల అమలులో లోపాలు వంటి అంశాలపై రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర ఉద్యమాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణే తన ప్రధాన లక్ష్యమని, రాష్ట్రంలోని ప్రతి మెడికల్, సేల్స్ ఉద్యోగికి బీఎంఎస్ఆర్‌యూ అండగా నిలుస్తుందని తెలిపారు. సంఘటిత శక్తితో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని చెప్పారు. పప్పుల సురేష్ నియామకంపై రాష్ట్రవ్యాప్తంగా బీఎంఎస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, మెడికల్, సేల్స్ రంగ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన నాయకత్వంలో బీఎంఎస్ఆర్‌యూ మరింత బలోపేతమై ఉద్యోగుల సంక్షేమం కోసం సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వి. జగదీష్, సంయుక్త కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా క్యాతం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ నియామకాలకు సహకరించిన భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు రాష్ట్ర నాయకులకు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

# తెలంగాణ@12

## రాష్ట్రం సాధించాం... తెలంగాణను కాపాడుకుంటున్నామా?




జూన్ 2, 2014. దశాబ్దాల కల సాకారమైన రోజు. కన్నీళ్లు, కష్టాలు, ఆత్మాహుతులు, ఉద్యమాలు, రైలు రోకోలు, మిలియన్ మార్చ్‌లు, సకల జనుల సమ్మెలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అవతరించిన రోజు. అయితే పన్నెండేళ్ల తర్వాత తెలంగాణ సమాజం ముందున్న ప్రశ్న రాష్ట్రం ఏర్పడిందా లేదా అనేది కాదు... తెలంగాణ ఆత్మ, అస్థిత్వం, ఉద్యమ లక్ష్యాలు ఎంతవరకు సజీవంగా ఉన్నాయి? అనేదే. ఈ పన్నెండేళ్ల తెలంగాణను పరిశీలిస్తే రెండు దశలు స్పష్టంగా కనిపిస్తాయి. ఒకటి కేసీఆర్ యుగం. రెండోది రేవంత్ రెడ్డి యుగం. ఈ రెండు దశలు అభివృద్ధి, సంక్షేమం, రాజకీయాలు, అస్థిత్వం అనే నాలుగు కోణాల్లో తెలంగాణ భవిష్యత్తును ప్రభావితం చేస్తున్నాయి.

### కేసీఆర్ దశ: తెలంగాణ నిర్మాణమా... లేక వ్యక్తి కేంద్రిత పాలనా?

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తెలంగాణకు అత్యంత అవసరమైనది ఆత్మవిశ్వాసం. “తెలంగాణ వస్తే ఏమవుతుంది?” అని ఎగతాళి చేసిన వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పడింది. ఆయన మొదటి ఐదేళ్లలో తెలంగాణ అనే భావోద్వేగాన్ని అభివృద్ధి రాజకీయాలతో ముడిపెట్టగలిగారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, గురుకులాల విస్తరణ, జిల్లాల పునర్విభజన వంటి కార్యక్రమాలు తెలంగాణను దేశవ్యాప్తంగా చర్చనీయాంశం చేశాయి. అంతకుముందు వలసలు వెళ్లే పాలమూరు ప్రాంతం నేడు సాగునీటి చర్చలో నిలబడటం, మంచినీటి కోసం కిలోమీటర్లు నడిచే గ్రామాలకు ఇంటింటికీ నీరు అందించడం వంటి అంశాలు కేసీఆర్ ప్రభుత్వానికి రాజకీయంగా బలాన్ని ఇచ్చాయి. కానీ మరోవైపు తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువత ఆశించిన ఉద్యోగాలు మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదు. ఉద్యోగ నియామకాల ఆలస్యం, ధ్రూరాజ వివాదాలు, కుటుంబ పాలన ఆరోపణలు, పెరుగుతున్న అప్పులు, ప్రజా ప్రతినిధుల కంటే అధికార వ్యవస్థ చేతుల్లో అధికారం కేంద్రీకరణ వంటి అంశాలు ప్రభుత్వ వ్యతిరేకతకు కారణమయ్యాయి. తెలంగాణను సాధించిన నాయకుడిగా కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయినా, తెలంగాణను ప్రజాస్వామ్యపరంగా మరింత భాగస్వామ్య రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కొంత వెనుకబడ్డారనే విమర్శలు ఇప్పటికీ వినిపిస్తుంటాయి.

### రేవంత్ రెడ్డి దశ: మార్పు రాజకీయాలా... లేక కాంగ్రెస్ పునరాగమనమా?

2023 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పు కేవలం ప్రభుత్వ మార్పు కాదు. అది అధికార అహంకారంపై ప్రజాస్వామ్య ప్రతిస్పందన కూడా.

రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కంటే ముందుగా “ప్రభుత్వం మారింది” అనే సంకేతాన్ని ప్రజలకు ఇవ్వడానికి ప్రయత్నించింది. ఆరు గ్యారంటీలు, మహిళా సంక్షేమం, రైతు సంక్షేమం, యువతకు అవకాశాలు, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలను ముందుకు తీసుకొస్తోంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు ఏమిటంటే... తెలంగాణ ఉద్యమ భావజాలాన్ని కాంగ్రెస్ ఎలా అర్థం చేసుకుంటుంది? ఎందుకంటే కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిన పార్టీ కావచ్చు. కానీ తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన పార్టీ కాదు. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రతి నిర్ణయాన్ని తెలంగాణవాదులు మరింత నిశితంగా పరిశీలిస్తున్నారు. మళ్లీ తెరపైకి వస్తున్న అస్థిత్వ రాజకీయాలు తెలంగాణ ఉద్యమం కేవలం నీళ్లు, నిధులు, నియామకాల కోసమే జరగలేదు. అది చరిత్ర కోసం... సంస్కృతి కోసం... యాస కోసం... స్వీయ గౌరవం కోసం జరిగింది. “మా చరిత్ర మాకు కావాలి... మా నాయకులు మాకు కావాలి... మా గుర్తింపు మాకు కావాలి...” అనే భావోద్వేగమే తెలంగాణ ఉద్యమానికి ప్రాణం. అందుకే ప్రస్తుతం కొన్ని అంశాలు తెలంగాణవాదుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. విగ్రహాల రాజకీయాలు... చారిత్రక గుర్తింపుల చర్చ... తెలంగాణ వీరుల కంటే ఇతర ప్రాంతాల ప్రముఖులకు అధిక ప్రాధాన్యత లభిస్తోందనే అభిప్రాయం... ఇవి మళ్లీ అస్థిత్వ చర్చకు కారణమవుతున్నాయి. కొంతమంది ఉద్యమకారుల అభిప్రాయం ప్రకారం... “రాష్ట్రం వచ్చిందంటే పోరాటం పూర్తయిపోయిందని కాదు. తెలంగాణ గుర్తింపును కాపాడుకునే బాధ్యత ఇప్పుడు మొదలైంది.” అనే భావన బలపడుతోంది.

### తెలంగాణవాదుల మనోవేదన ఏమిటి?

ఉద్యమ సమయంలో ప్రతి గ్రామంలో వినిపించిన పేర్లు... ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, దాశరథి, కాళోజీ, చాకలి ఐలమ్మ, కొమరం భీమ్, షోయబుల్లా ఖాన్... ఇవే తెలంగాణ ఆత్మకు ప్రతీకలు.

కానీ నేడు అధికారిక చర్చల్లో, రాజకీయ ప్రాధాన్యతల్లో వీరికి తగిన స్థానం దక్కుతోందా? అనే ప్రశ్న తెలంగాణ మేధావుల నుంచి వినిపిస్తోంది. వారి వాదన ప్రకారం అభివృద్ధి అవసరం. పెట్టుబడులు అవసరం. గ్లోబల్ నగరాలు అవసరం. కానీ తెలంగాణ చరిత్రను పక్కన పెట్టి అభివృద్ధి సాధిస్తే అది శరీరానికి ప్రాణం లేని పరిస్థితిలా మారుతుందని చెబుతున్నారు.

### భవిష్యత్తులో కొత్త ఉద్యమాలు వస్తాయా?

తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం లాంటి భారీ పోరాటం మళ్లీ వచ్చే అవకాశాలు తక్కువే. కానీ అస్థిత్వం, సంస్కృతి, భాష, చరిత్ర పరిరక్షణ కోసం చిన్న చిన్న ఉద్యమాలు భవిష్యత్తులో పెరిగే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఎందుకంటే నేటి యువత ఉద్యోగాలు అడుగుతోంది. అదే యువత తన ప్రాంతీయ గుర్తింపును కూడా కాపాడుకోవాలనుకుంటోంది. అందుకే రాబోయే తెలంగాణ రాజకీయాలు కేవలం అభివృద్ధి కేంద్రంగా కాకుండా “అభివృద్ధి ం అస్థిత్వం” అనే ద్వంద్వ సూత్రంపై నడిచే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణకు అసలు పరీక్ష ఇప్పుడే మొదలైంది 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించింది. 2026లో తెలంగాణ తనను తాను నిర్వచించుకునే దశలో ఉంది. కేసీఆర్ తెలంగాణకు రాజకీయ రూపం ఇచ్చారు. రేవంత్ రెడ్డి తెలంగాణకు కొత్త పరిపాలనా దిశ చూపించాలని ప్రయత్నిస్తున్నారు. కానీ చరిత్ర ఒక ప్రశ్న అడుగుతోంది... “తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది... కానీ తెలంగాణ ఆత్మ ఎంత బలంగా నిలిచి ఉంది?” అభివృద్ధి ఆకాశ హర్మ్యాల్లో కనిపిస్తుంది. అస్థిత్వం మాత్రం ప్రజల గుండెల్లో ఉంటుంది. ఆ గుండె చప్పుడు వినిపిస్తున్నంత కాలం తెలంగాణ ఉద్యమం ముగిసినట్లుకాదు. రాష్ట్రం సాధించిన తెలంగాణ... ఇప్పుడు తన అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, ప్రత్యేకతను కాపాడుకునే రెండో అధ్యాయంలోకి అడుగుపెడుతోంది. ఇది రాజకీయ పోరాటం కంటే పెద్దది... సాంస్కృతిక అస్తిత్వ పోరాటం.

-ఎస్.వి.రమణా చారి,సీనియర్ జర్నలిస్ట్

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, జూన్ 2: ప్రజావాణిలో అందిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి, క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణిలో మొత్తం 188 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు పర్యవేక్షిస్తున్నందున అధికారులు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తూ దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న లోకాయుక్త, జాతీయ మానవ హక్కుల కమిషన్ ఫిర్యాదులు, న్యాయస్థానాలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

### రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తరించేందుకు, వరదలు, విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు సకాలంలో సహాయం అందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులు రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం పొందాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు



కరీంనగర్, జూన్ 2: కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. సోమవారం రాత్రి పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ స్వయంగా పరిశీలించారు. వేదిక, సీటింగ్, పార్కింగ్, తాగునీటి సదుపాయం, విద్యుత్ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆహ్వానితులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, అత్యవసర సేవల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ సమావేశాలకు కరీంనగర్ మేయర్‌కు ఆహ్వానం

## ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి సమావేశాల్లో పాల్గొననున్న కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జూన్ 2: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ఋషికేశ్‌లో ఈ నెల 3, 4 తేదీలలో జరగనున్న ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117వ సమావేశాలకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ కు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఋషికేశ్ నగరపాలక సంస్థ తరఫున సోమవారం మేయర్‌కు అధికారిక ఆహ్వాన పత్రాన్ని పంపించారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ అధ్యక్షురాలు రేణు బాల గుప్తా అధ్యక్షతన జరిగే ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా పుష్కర్ సింగ్ ధామి హాజరుకానున్నారు. అలాగే పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు కూడా పాల్గొననున్నారు. ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ కార్యదర్శి మనోజ్ గుప్తా, ఋషికేశ్ మేయర్ రణజయ్ పాన్వర్ ఆహ్వానం మేరకు మేయర్ కొలగాని శ్రీనివాస్ సమావేశాలకు హాజరుకానున్నారు. ఈ సమావేశాల్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన మేయర్లు పాల్గొని పట్టణాభివృద్ధి, నగర పాలన, ప్రజా సేవల మెరుగుదల, స్మార్ట్ సిటీ కార్యక్రమాలు, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించనున్నారు. నగరాల అభివృద్ధికి సంబంధించిన అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకునే వేదికగా ఈ సమావేశాలు ఉపయోగపడనున్నాయి.

# ఐఐటీ అడ్వాన్స్‌డ్--2026 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ







## జాతీయ స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి సత్తా చాటిన విద్యార్థులు

కరీంనగర్, జూన్ 1: ఐఐటీ అడ్వాన్స్‌డ్--2026 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించి సంస్థకు మరోసారి కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. నేడు ప్రకటించిన ఫలితాల్లో కె. ప్రజ్ఞాన్ దీపక్ జాతీయ స్థాయిలో 75వ ర్యాంకు సాధించగా, సి.హెచ్. లక్ష్మీహాసిని 400, ఎన్. రత్నప్రకాశ్ 497, బి. లిఖిత్ సాయి 785, ఎం. వశిష్ఠ 800, బి. స్పందన 954, కె. ధనుష్ 1294, ఎం. జోహన్ 1400, పటేల్ అక్షయ 1488, సి.హెచ్. అభిరామ్ రావు 1618, ఎ. సత్యవర్ధన్ 1678 ర్యాంకులు సాధించారు. ఈ ఫలితాల్లో వెయ్యి లోపు 6 మంది, రెండు వేల లోపు 11 మంది, మూడు వేల లోపు 19 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం విశేషమని పేర్కొన్నారు. పటిష్ట ప్రణాళికతో కూడిన బోధన, నిరంతర పర్యవేక్షణ, అధ్యాపకుల కృషి, విద్యార్థుల అంకితభావమే ఈ విజయానికి కారణమని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో ఐఐటీ శిక్షణను ప్రారంభించి, అనేక మంది విద్యార్థులను ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో సీట్లు సాధించే స్థాయికి తీసుకెళ్లిన తొలి విద్యాసంస్థ అల్ఫోర్స్ అని పేర్కొన్నారు. ప్రతి ఏడాది అల్ఫోర్స్ శిక్షణతో ఐఐటీల్లో ప్రవేశాలు పొందుతున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. అలాగే త్వరలో వెలువడనున్న నీట్--2026 ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరుస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్--2026లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేసిన డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, ఈ విజయానికి సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.







# ప్రపంచ సైక్లింగ్ దినోత్సవం సందర్భంగా జూన్ 3న సైకిల్ ర్యాలీ

## పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ పిలుపు



కరీంనగర్, జూన్ 2: ప్రపంచ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 3న నిర్వహించనున్న సైకిల్ ర్యాలీలో ఔత్సాహిక సైక్లిస్టులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని వావిలాలపల్లిలో గల అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో మంగళవారం సైకిల్ ర్యాలీ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 3న ఉదయం 5.30 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి ఎలగందల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలో పాల్గొని పూర్తి చేసిన సైక్లిస్టులకు ప్రశంసా పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. అన్ని వయస్సుల వారు తమ సైకిళ్లతో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్యం సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సంరక్షణకు కూడా తోడ్పాటు అందించవచ్చని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన సంక్షోభం, చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో శిలాజ ఇంధన వాహనాల వినియోగాన్ని తగ్గించి సైక్లింగ్‌ను దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు జూన్ 3న ఉదయం 5.30 గంటలకు తెలంగాణ చౌరస్తా వద్ద సైకిళ్లతో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్, కోశాధికారి వి. జగదీశ్వరాచారి, కార్యవర్గ సభ్యులు అఖిల్ రెడ్డి, డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, ఎం. మహేందర్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 9032762247, 9398230614 నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

# కరీంనగర్ ఇరిగేషన్ సీఈగా విద్యావతి

తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ గా విద్యావతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీగా పని చేసిన విద్యావతి కరీంనగర్ ఇరిగేషన్ కి బదిలీ అయ్యారు. కరీంనగర్ ఇరిగేషన్ ఈఎన్సీగా ఇంచార్జ్‌గా ఉన్న మధుసూధన్ రావు ఓ అండ్ ఎం ఈఎన్సీగా హైదరాబాద్ కి బదిలీ అయ్యారు. కాగా ఈఎన్సీ హైదరాబాద్ కి బదిలీ కావడం, కరీంనగర్ ఇరిగేషన్ కి సీఈకి పోస్టింగ్ ఇవ్వడంతో కరీంనగర్ ఇరిగేషన్ ఆఫీసును సీఈ ఆఫీసుగా పరిగణలోకి తీసుకుంటామని కార్యాలయ ఉద్యోగులు స్పష్టం చేశారు.

# ఎంవీఐ, ఏఎంవీఐలు బదిలీ

తిమ్మాపూర్, జనతా న్యూస్ : కరీంనగర్ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో పని చేసిన ముగ్గురు ఎంవిఐలు, ఏఎంవీఐలు బదిలీ కాగా కొత్తగా తొమ్మిది మంది అధికారులకు పోస్టింగ్ ఇచ్చారు. కరీంనగర్ ఆర్టీఏ కార్యాలయంలో పని చేసిన ఎంవీఐలు శ్రీకాంత్ చక్రవర్తి మెదక్ జిల్లాకు, రవి కుమార్ పెద్దపల్లికి, ఏఎంవీఐ స్రవంతి హుజురాబాద్ యూనిట్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. కరీంనగర్ జిల్లా ఎంవీఐలుగా నిజామాబాద్ నుండి జే. ఉమామహేశ్వర్ రావు, వరంగల్ నుండి టి.జైపాల్ రెడ్డి, కొమురంభీం ఆసిఫాబాద్ నుండి జి.కవిత బదిలీపై వచ్చారు. కాగా ఆరుగురు ఏఎంవీఐలు ఇతర ప్రాంతాల నుండి కరీంనగర్ ఆఫీసుకు వచ్చారు. నిర్మల్ నుండి ముర్తుజా అలీ అహ్మద్, నిజామాబాద్ నుండి కుమ్మరి సాగర్, కర్ర శృతి, కామారెడ్డి నుండి శాం రిచర్డ్ సన్, ఎండీ ఇర్షద్ అలీ, హనుమకొండ నుండి కీర్తి ఉదయ్ కరీంనగర్ కి బదిలీ అయ్యారు. కాగా ఉమా మహేశ్వర్ రావు, కవితలు ఎంవీఐలుగా సోమవారం కరీంనగర్ లో బాధ్యతలు తీసుకున్నారు.

# గంగాధర మండల వాసికి మహోన్నత సేవా పతకం



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ సేవా పతకాలను ప్రకటించింది. వివిధ విభాగాల్లో విశిష్ట, అత్యుత్తమ సేవలు అందించిన పోలీస్, ప్రత్యేక రక్షణ దళం, అగ్నిమాపక శాఖాధికారులకు ఈ అవార్డులను కేటాయిస్తూ హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇంటెలిజెన్స్ విభాగంలో పర్నే సత్యనారాయణ రెడ్డికి మహోన్నత సేవా పతకం లభించింది. ఆయన అందించిన సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం సత్యనారాయణరెడ్డికి ఈ పతకాన్ని అందించనుంది. అందులో భాగంగా ఆయనకు పతకంతో పాటు ఒకేసారి రూ.40,000 వేల నగదు ప్రోత్సాహకంగా దక్కనుంది. పర్నే సత్యనారాయణ ఉమ్మడి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఆచంపల్లి గ్రామానికి చెందినవారు. 1991లో పోలీస్ శాఖలో ఆయన చేరారు. 2002 సంవత్సరంలో అవినీతి నిరోధక శాఖలో సేవా పతకాన్ని అందుకున్నారు. కాగా 2018 సంవత్సరంలో ఇంటెలిజెన్స్ లో ఉత్తమ సేవా పతకాన్ని కూడా అందుకున్నారు. కాగా తాజాగా రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహోన్నత సేవా పతకం కూడా దక్కడం గమనార్హం. సత్యనారాయణ రెడ్డికి ఈ పతకం దక్కడంపై తోటి ఉద్యోగులు, కుటుంబీకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ పతకం దక్కడంపై ఉన్నతాధికారులు సత్యనారాయణ రెడ్డికి అభినందనలు తెలిపారు.


# లక్ష్మీపూర్ లో ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ల ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో గ్రామ సర్పంచ్ ముక్కిస కవిత రత్నాకర్ రెడ్డి మండల తహసిల్దార్ శ్రీకాంత్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్ లతో కలిసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమ సొంత ఇంటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్, స్థానిక ఉపసర్పంచ్ గంగాధర హరీష్, బెజ్జంకి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు బైర సంతోష్, బెజ్జంకి మాజీ సర్పంచ్ రావుల నరసయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు రెడ్డి రామకృష్ణారెడ్డి, గుబిరె చంద్రం, కత్తి రమేష్ గౌడ్, వార్డు సభ్యులు తిరుమల, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యలపై జనసేన నేతల ఆందోళన

## తెలంగాణ చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించిన జనసైనికులు



కరీంనగర్, జూన్ 1: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కరీంనగర్‌లో జనసేన నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఆదివారం తెలంగాణ చౌక్‌లో కళ్యాణ్ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జనసేన పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో జనసేన పార్టీకి ప్రజాదరణ పెరుగుతున్న నేపథ్యంలో పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు, దుష్ప్రచారాలను జనసైనికులు తీవ్రంగా ఖండిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో జనసేన పార్టీ బలోపేతానికి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని, రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి, కరీంనగర్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ కందుల రాజీ రెడ్డి, వొద్నల రాజు, కాసా రాజు, పొన్నాల తిరుపతి, సామ చరణ్ రెడ్డి, గూడూరి రామ్, యశ్వంత్ రావు, నాయిని రవి వర్మతో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com